క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి సహకారం

పటాన్‌చెరు: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పోచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ భిక్షపతి, సీనియర్ నాయకులు భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లో ఇటీవల నిర్మించిన ఇళ్లలో చిల్లర దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. వారం రోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లకు వేసిన తాళాలను పగలగొడుతున్నారు. కాలనీలో చోరీలను అరికట్టేవిధంగా పోలీసులు నిఘాను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మగ్గంవర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు మే 20 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగినవారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో లేదా మరిన్ని వివరాలకు 9704446956, 9490129839 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని జవహర్‌లాల్ కాలనీలో శ్రీకాంత్‌గౌడ్ అనే వ్యక్తి హోటల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు బుధవారం సమాచారం అందింది. దీంతో పోలీసులు హోటల్‌పై దాడులు నిర్వహించి 10.75 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని శ్రీకాంత్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ సీఐ నాగరాజు మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటరు స్లిప్పులు అందించాలి

హత్నూర(సంగారెడ్డి): ఓటర్లందరికి స్లిప్పులను అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్‌పర్వీన్ అన్నారు. బుధవారం హత్నూర రైతు వేదికలో బీఎల్‌ఓలు గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ హత్నూర మండలంలో 42వేల ఓట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల వెంటనే దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వచ్చే నెల 5వ తేదీలోపు ఓటర్లకు స్లిప్పులు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఆఫీసర్లు లలిత, గోవర్ధన్, ఆర్‌ఐ శ్రీనివాస్, బీఎల్‌ఓలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ తహసీల్దార్‌గా భూపాల్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల తహసీల్దార్‌గా భూపాల్ నియమితులయ్యారు. మేడ్చల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న భూపాల్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు. బదిలీపై వచ్చిన భూపాల్ బుధవారం విధుల్లో చేరారు. అనంతరం మండల పరిధిలోని హుస్సెళ్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

నిర్మాణరంగంపై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు మైహోమ్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్మాణ పరిశ్రమ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైహోమ్ గ్రూప్ సీనియర్ జీఎం నాగిరెడ్డయ్య పాల్గొని విద్యార్థులకు డిజైన్, పర్యావరణ, భద్రత, ప్రణాళిక, నాణ్యత తదితర అంశాలను వివరించారు. ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్‌లో విజయవంతమైన కేరియర్ కోసం విద్యార్థులనుసిద్ధం చేసేందుకు మేరు ఇంటర్నేషనల్ స్కూల్, మైహోమ్ గ్రూప్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- ఎండిపోయిన చెట్లతో పార్కుల దర్శనం
- ఐదేళ్లుగా నిర్వహణకు నోచుకోని వైనం
- పార్కులను అభివృద్ధి చేయాలని కార్మికుల విన్నపం
- పట్టించుకోని భెల్ పరిశ్రమ యజమాన్యం



భెల్ చెక్‌పోస్ట్ సమీపంలోని కళతప్పిన రాక్‌గార్డెన్ పార్కు

ఒకప్పుడు పచ్చని చెట్లు, రకరకాల పూల మొక్కలతో ఉద్యానవనాలకు కేరాఫ్ అడ్రస్‌గా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ ఉండేది. ఇక్కడి ఉద్యానవనాలు మైసూర్‌లోని బృందావనాన్ని తలపించేవిధంగా కళకళలాడేవి. కానీ.. నేడు ఎండిపోయిన చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా భెల్ పరిశ్రమ కార్మికుల కుటుంబాలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. గతంలో సెంట్రల్‌పార్కు, రాక్‌పార్క్, సుందరవనం పార్కులు పెద్దలతో పాటు చిన్నారులతో సందడిగా ఉండేవి. ఈ పార్కుల్లో అనేక సినిమా షూటింగ్‌లు సైతం నిర్వహించేవారు. ఆ తర్వాత భెల్ పరిశ్రమ యాజమాన్యం పార్కుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారాయి.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

రామచంద్రాపురం పట్టణంలోని బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ ఏర్పాటు చేసిన తరువాత కార్మికుల కోసం టౌన్‌షిప్‌లో క్వాటర్స్‌తో పాటు పార్కులను ఎంతో అభివృద్ధి చేశారు. భెల్‌టౌన్‌షిప్‌లోని సెంట్రల్ పార్కు, సుందరవనం పార్కులతో పాటు పలుచోట్ల చిన్న పార్కులను అభివృద్ధి చేశారు. దీంతో ఈ పార్కుల్లో సాయంత్రం సమయాల్లో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు చిన్నారులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా గడిపేవారు. గతంలో సెంట్రల్ పార్కు పెద్దలతో, చిన్నారులతో సందడిగా ఉండేది.

అభివృద్ధికి నోచుకోని రాక్ గార్డెన్

18 ఏళ్ల క్రితం భెల్ చెక్‌పోస్ట్ సమీపంలో లక్షలాది రూపాయలను ఖర్చు చేసి రాక్ గార్డెన్ పార్కును అభివృద్ధి చేశారు. అదేవిధంగా జంతువుల బొమ్మలతో వాటర్ ఫౌంటేన్‌తో ఎంతో సుందరంగా అభివృద్ధి చేశారు. కొంతకాలం తర్వాత పార్కుల నిర్వహణ విషయంలో భెల్ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు వాపోతున్నారు.



కళావిహీనంగా భెల్ సెంట్రల్ పార్కు



మూతపడిన సుందరవనం పార్కు

సెంట్రల్ పార్క్‌లో నామమాత్రపు పనులు

ఇటీవల భెల్ సెంట్రల్ పార్కులో పరిశ్రమ యజమాన్యం నామమాత్రంగా పనులు చేపట్టింది. చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలకు రంగులు వేసి చేతులు దులుపుకున్నారు. వేలాదిమంది నివసించే బెల్ కాలనీలో సరైన పార్కులు లేకపోవడంతో స్థానికులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. ఇప్పటికైనా భెల్ టౌన్‌షిప్‌లోని పార్కులను అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు, కార్మికులు భెల్ పరిశ్రమ యాజమాన్యంను కోరుతున్నారు.

నీటి వనరులు ఉన్నా.. నిర్వహణ శూన్యం

కోవిడ్ సమయంలో పార్కులకు తాళాలు వేసి చేతులు దులుపుకున్న యాజమాన్యం ఆతర్వాత వాటి నిర్వహణను పూర్తిగా మర్చిపోయింది. 5ఏళ్లుగా భెల్ యాజమాన్యం పార్కులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కళావిహీనంగా మారాయి. భెల్ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ పార్క్, సుందరవనం, బెల్ చెక్‌పోస్ట్ సమీపంలోని రాక్‌గార్డెన్‌లోని ఈ పార్కుల్లో నీటి వనరులు సైతం పుష్కలంగా ఉన్నా పట్టించుకునేనాథుడు కరువయ్యాడు. దీంతో పార్కుల సంరక్షణపై యజమాన్యం పట్టించుకోకపోవడంతో పచ్చని చెట్లు, మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి, రాయిపల్లి(డి), డిడిగి, కొత్తూర్(బి) గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి 24 గంటల నిరంతరంగా విద్యుత్‌ను అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు పథకాలను అమలుచేసి కేసీఆర్ దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలకు మంగళం పాడిందని ధ్వజమెత్తారు. రైతుబంధు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, గుండప్ప, పెంటారెడ్డి, మచ్చేందర్, మోహన్‌రెడ్డి, విజయ్ రాథోడ్, మాణయ్య, రాములు, చిరంజీవిరెడ్డి, ఏసురత్నం, గోవర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కరణ్‌రాజ్, వీరన్నపటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపునకు అందరూ కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎస్‌ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ అధ్యక్షతన బీజేపీ నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు శివాజీపాటిల్, పాండురంగారావు పాటిల్, బస్వరాజ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'బీజేపీకి ఉజ్వల భవిష్యత్తు'

కోహీర్(జహీరాబాద్): బీజేపీకి అనుకులంగా రాష్ట్రంలో రాజకీయ సమీకరణలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్ అధ్యక్షతన కోహీర్ పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజుస్వామి, నర్సింహులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో జర్నలిస్టులు

జహీరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జర్నలిస్టులు ఆసక్తి చూపుతున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా బుధవారం జర్నలిస్టులు టి.అశోక్ ఒక సెట్టు, రమేష్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇరువురు అభ్యర్థులు కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన వారే. గ్రామంలోని రసాయన కర్మాగారంతో ఎదురవుతున్న ఇబ్బందులను, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడాన్ని వెలుగులోకి తెచ్చేందుకు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అశోక్

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలలు
- అభినందనలు తెలిపిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు



శ్వేత, బైపీసీ (981/1000)

ఝరాసంగం(జహీరాబాద్): ఇంటర్మీడియట్ ఫలితాలలో మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో మొదటి సంవత్సరం ఎంపీసీలో 26 మంది విద్యార్థులకు గాను 21మంది విద్యార్థులు, బైపీసీలో 21మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 15మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10 మంది, బైపీసీలో 28 మందికి గాను 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో శ్వేత, మౌనిక 1000 మార్కులకు 981 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరంలో 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 17 మంది, ద్వితీయ సంవత్సరంలో 66 మందికి గాను 23మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

ఇంటర్‌లో 42.57 శాతం ఉత్తీర్ణత

కోహీర్(జహీరాబాద్): కోహీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 148 విద్యార్థులు పరీక్ష రాయగా 42.57 శాతంతో 3 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటించారు. మొదటి సంవత్సరంలో 130 మంది పరీక్ష రాయగా 30 శాతంతో 39 మంది ఉత్తీర్ణులయ్యారు.

పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం 37, మొదటి సంవత్సరం 32శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పొందారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఎంపీసీకి చెందిన ఆదర్శరాయ్, సాద్ సయ్యద్ 1000 మార్కులకు గాను 939 మార్కులు సాధించగా షేక్ హుస్న 889 మార్కులు సాధించింది. బైపీసీ విద్యార్థిని శిరీష 903 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థిని శ్రీవల్లి 500 మార్కులకు గాను 463, పూజిత 436, బైపీసీ విద్యార్థిని హర్షిత శ్రీ 440 కి 419, సీఈసీ విద్యార్థిని వైష్ణవి 500 మార్కులకు గాను 458 మార్కులు సాధించింది.

53 శాతం మాత్రమే ఉత్తీర్ణత

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది. ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో 78 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా మల్లీశ్వరి 404 అత్యధిక మార్కులు పొందగా ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 66 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా సంగీత 927 మార్కులు సాధించింది. కళాశాల మొత్తంగా మొదటి సంవత్సరంలో 28 శాతం, ద్వితీయ సంవత్సరంలో 53 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదు అయ్యింది.

ఇంటర్ ఫలితాల్లో ఉజ్వల విద్యార్థుల ప్రతిభ

సదాశివపేట(సంగారెడ్డి): ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర, పట్టణ స్థాయి ర్యాంకులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో వైష్ణవి 983 మార్కులతో పట్టణ ఫస్ట్‌ర్యాంకు సాధించింది. బీపీసీ వన్‌లో నేహాఫిర్దోస్ 440 మార్కులకు గాను 430 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో 500 మార్కులకు గాను 457 మార్కులు సాధించి పట్టణ ప్రథమ ర్యాంకు సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470/452 మార్కులతో మోమిన్‌బేగం ఫస్ట్‌ర్యాంకు సాధించారు.

టాపర్‌గా జ్యోతి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీపీసీ విద్యార్థులు జ్యోతి అత్యధిక మార్కులు సాధించింది. 919 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. రెండో స్థానంలో దీపిక 876 మార్కులు సాధించింది. కళాశాలలో సెకండియర్‌లో మొత్తం 69 మంది విద్యార్థులకు గాను 35 మంది(51 శాతం) ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీఈసీలో 85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జీజేసీ ఫస్టియర్‌లో 94 మంది విద్యార్థులకు 27 మంది (21శాతం) ఉత్తీర్ణత పొందారు. కాగా టీటీడబ్ల్యూబీఆర్‌ఎస్‌లో ఫస్టియర్‌లో 55 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

'మోడల్' విద్యార్థుల ప్రతిభ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని తెలంగాణ మోడల్ ఇంటర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇంటర్ ఫస్టియర్‌లో 154మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎంపీసీలో ప్రియాసింగ్ 457, బైపీసీలో సిద్దిక్ 432, ఎంఈసీలో సమీరా 474, సీఈసీలో సబాబేగం 453లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 128 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 76శాతం విద్యార్థులు ఉతీర్ణతను సాధించారు. వీరిలో ఎంపీసీలో ప్రియాంక 978, బైపీసీలో భార్గవి 978, ఎంఈసీలో సానియా 973, సీఈసీలో నిఖిత 964 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కాగా జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తగిన ఉత్తీర్ణతను సాధించలేకపోయారు. ఫస్టియర్‌లో 36శాతం, సెకండ్ ఇయర్‌లో 45శాతం మాత్రమే ఉత్తీర్ణతను సాధించారు. జిన్నారంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఫస్టియర్‌లో 6శాతం, సెకండ్ ఇయిర్‌లో 52శాతం ఉత్తీర్ణతను సాధించారు. సెకండ్ ఇయర్ బైపీసీలో వినోద్ 784 మార్కులు సాధించగా ఎంపీసీలో సంజీవ 745 మార్కులను సాధించాడు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాకేంద్రంలో ఫస్టియర్‌లో 66శాతం, సెకండ్ ఇయర్‌లో 80శాతం ఉత్తీర్ణతను సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో అంజలి 945 మార్కులు సాధించింది.



ప్రియాంక, ఎంపీసీ (978)



సానియా, ఎంఈసీ(973)



భార్గవి, బైపీసీ (978)



నిఖిత సీఈసీ (964)



అంజలి, ఎంపీసీ (945)

ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వ గురుకులాలు

జహీరాబాద్: జహీరాబాద్‌లోని రంజోల్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు చెందిన శిరీష ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు గాను 990 మార్కులను సాధించింది. పింకీ 982 మార్కులను సాధించింది. హోతి(కె)లోని రెసిడెన్షియల్ గురుకుల కళాశాలకు చెందిన భాగ్యలక్ష్మి ద్వితీయ సంవత్సరం బైపీసీలో 985 మార్కులు, ఎంపీసీలో అలవేణి 986 మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో ఇదే కళాశాలకు చెందిన నిత్య స్వరూపిణి, వైశాలి, పి.సాయిభవానీలు 440/435 మార్కులను సాధించారు. ఎంపీసీలో దేవిశ్రీ 470 మార్కులకు గాను 466, అర్చన 464 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారు. ఆర్‌ఎల్‌ఆర్ కళాశాలకు చెందిన కుర్మి అన్విత్ 466 మార్కులను సాధించాడు.



అలవేణి 986/1000



భాగ్యలక్ష్మి 985/1000

ఇంటర్‌లో 24.50 శాతం

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో 24.50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 19 శాతం ఉత్తీర్ణత సాధించగా న్యాల్‌కల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 28 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ వెల్లడించారు. హద్నూర్ కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థిని వైష్ణవి 470కి 419 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

69.50 శాతం ఉత్తీర్ణత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 131మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 91మంది ఉతీర్ణత సాధించారు. ఎంపీసీలో సత్య నివేదిత977 మార్కులు, బీపీసీలో వర్ధిని 978 మార్కులు, సాయి లక్ష్మీ 973 మార్కులు, సీఈసీలో సామ్య 911 మార్కులు, ఎంఈసీలో కావ్య 921మార్కులు సాధించినట్లు వివరించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 154మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 79మంది ఉతీర్ణత సాధించారు.

బాలికలదే పైచేయి

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాల, మునిపల్లి మోడల్ స్కూల్, లింగంపల్లి గురుకుల పాఠశాలలో బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. మండల్ టాపర్‌గా మునిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఎంపీసీ సెంకడీయర్ చదువుతున్న హుమెమా తహరీమ్ 934 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. మానస బైపీసీ 918 ద్వితీయ స్థానం సాధించగా హుమా ఎంపీసీ సెకండీయర్‌లో 894 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్‌లో 271 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో 124 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టీయర్‌లో మన్నే హర్షిత 403, పోసాని అతిధి 368, విభుతి కల్పన 396 మార్కులు సాధించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ముగిసిన వీరభద్రేశ్వరస్వామి జాతర**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెరియంపూర్ సమీపంలో ఉన్న వీరభద్రేశ్వర స్వామి జాతర బుధవారంతో ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుస్తీపోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన పైల్‌వాన్‌లు పాల్గొని అలరించారు. మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు చెందిన ప్రకాష్ కుస్తీపోటీల్లో గెలుపొంది ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు బస్వరాజ్‌పటేల్ పాల్గొన్నారు.

◆ **పోలింగ్ కేంద్రాల సందర్శన**

హత్నూర(సంగారెడ్డి): మండలం మల్కాపూర్, మంగాపూర్ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ షేక్ ఫర్వీణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని స్థానిక పీఎల్‌వోకు సూచించారు. ఓటుహక్కును సజావుగా వినియోగించుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

◆ **ముగిసిన అఖండ సప్తభజన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో ఏడు రోజులుగా కొనసాగిన సప్త అఖండ నామస్మరణ భజన బుధవారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజల క్షేమాన్ని కోరుతూ సప్త భజన నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు పేర్కొన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో సిద్దేశ్వరస్వామి పల్లకీ సేవ**

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని పొట్టిపల్లి శివారులోని సిద్దేశ్వరస్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ **స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రోమైండ్ ఫౌండర్ గంగాధర్ కమ్యూనికేషన్స్ స్కిల్స్, సెల్ఫ్ అవేర్నెస్, మేనేజింగ్ ఎమోషన్స్, మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకులు నందుగౌడ్, నర్సింలు, శ్వేత, నిఖిత, లావణ్య దీపిక, కరుణ, ఇష్రత్ సుల్తానా, అమీనా సిద్ధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరినవారికి మంత్రి దామోదర రాజనర్సింహ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి పాటిల్, ఖాజాసాబ్, మునురొద్దీన్ ఉన్నారు.

నిర్మలాజగ్గారెడ్డి సమక్షంలో...

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ నుంచి మాజీ మార్కెట్ కమిటీ డైరక్టర్ లతీఫ్ సంగారెడ్డిలో టీజీఐఐఎఫ్ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, వసీం, ఖలీల్, సాబేర్, వాజిద్, నవాజ్ పాల్గొన్నారు.

◆ **బీజేపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం**

జహీరాబాద్: జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ విజయం కోసం ఆయన కోడలు వచనాపాటిల్ పట్టణంలోని రాంనగర్, శాంతినగర్, బసవేశ్వరకాలనీ, సుభాష్‌గంజ్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణకౌశాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు అనితస్వామి, పట్టణ ఉపాధ్యక్షురాలు అర్చన సారడా, మంజూల కౌశాస్, పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, పట్టణ నాయకుడు అరుణ్ పాల్గొన్నారు.

◆ **28 వరకు దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి టౌన్: పదో తరగతి ఉత్తీర్ణతతో పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను అభ్యసించేందుకు పాలీసెట్ అర్హత పరీక్ష దరఖాస్తుకు ఈ నెల 28 వరకు గడువు ఉందని సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250, ఇతరులు 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష మే 24వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.